
ప్రజాశక్తి
శుక్రవారం 10 అక్టోబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





దుకాణాలు సీజ్

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : కమిషనర్ వై.ఓ. నందన్ ఆదేశాల మేరకు కార్పొరేషన్‌కు చెందిన స్థానిక చిన్న బజార్, ఏ.సి.ఎస్.ఆర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోని పలు షాపు లీజు దారులు కొన్నేళ్లుగా బాడుగలు, రెన్యువల్ అమౌంట్ చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో చాలాసార్లు నోటీసులు జారీచేసినా స్పందించకపోవడంతో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ ఆఫీసరు ఎస్.ఏ సమద్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సి.వి.ఎస్ కిరణ్, వర ప్రసాద్ లు సచివాలయ సిబ్బందితో కలిసి 2, 11, 22, 30 గల షాపులను సీజ్ చేశారు. సచివాలయ అడ్మిన్లు కిషోర్, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.



సిఎం సారూ.. ఉద్యోగం..ఉపాధి చూపండి..!

◆సింహపురి నిరుద్యోగ యువత నిర్వేదం
◆కిసాన్ సెజ్‌లో 60 వేల మందికి అవకాశం
◆కృష్ణపట్నం పోర్టును గాడిలో పెట్టండి
◆నేడు సిఎం చంద్రబాబురాక
◆బయో ఎనర్జీ ప్లాంట్ ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెబుతుంది... ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఆర్థిక మండళ్లు (సెజ్)ల పేరుతో పారిశ్రామికవేత్తలకు 60 వేల ఎకరాలు పంపిణీ చేశారు...పరిశ్రమలు పెద్దగా రాకపోగ, నిరుద్యోగ యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక నిర్వీర్యమైపోతోంది.... కిసాన్‌సెజ్‌లో తక్షణమే పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అనువైన పరిస్థితులున్నాయి. ఇదే జరిగితే సుమారు 60 వేల మందికి ప్రత్యక్షం, పరోక్షంగా అవకాశాలు కలుగుతాయి... కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరిస్తే 15 వేల మంది ఉద్యోగులు కొనసాగుతారు...రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్ సంస్థలు వస్తే జిల్లాలో నిరుద్యోగ యువతే ఉండదు. నేడు సర్వేపల్లి నియోజకవర్గంలో బయో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో వెయ్యి మందికి ఉపాధి కలుగుతోందని చెబుతున్నారు. ఇదే ఒరవడి కొనసాగించాలని జిల్లా యువత కోరుతోంది..

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం 2004 నుంచి ఐదు సెజ్‌ల ఏర్పాటుతో ఎన్నో పరిశ్రమలు వచ్చి.. లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి దక్కుతోందని చెప్పారు. 2004లో మాంబట్టు, మేనకూరు, తడ, శ్రీసిటి, చింతవరం, కృష్ణపట్నం, రేగడ చెలిక ప్రాంతాల్లో సెజ్‌లు ఏర్పాటు చేశారు.. ఇటీవల కాలంలో అదాని చేతికి వెళ్లాక కృష్ణపట్నం పోర్టులో సుమారు 15 వేల మంది కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి పోయింది. ఇప్పటి వరకు థర్మల్ పవర్ ప్రాజెక్టుల పేరుతో 33 వేల ఎకరాలు , మేనకూరు సెజ్ పేరుతో 5600 ఎకరాలు, . శ్రీసిటి 5,700, కొడవలూరు మండలం రేగడచెలిక కిసాన్ సెజ్‌లో 2776 ఎకరాలు, చిల్లకూరు మండలం, చింతవరం టెక్స్‌టైల్‌పార్కు పేరుతో 2700 ఎకరాలు, కృష్ణపట్నం పోర్టులో సెజ్ అభివృద్ధి కోసం 6000 ఎకరాలు , మిథానీ ఉక్కు పరిశ్రమ కోసం 500 ఎకరాలు , వాకాడు మండలం తూపిలిపాళెం ఎన్ఐఓటి కోసం 500 ఎకరాలు, తీసుకున్నారు. సుమారు 60 వేల ఎకరాల్లో కేవలం 10 వేల ఎకరాలు మాత్రమే ఉపయోగంలో ఉంది.



సిఎం చంద్రబాబునాయుడు

సిఎం సార్ ఉపాధి కల్పంచండి..!

రాష్ట్ర ప్రభుత్వం పిపిపి, పి4 పేరుతో పేదలను ఆర్థికాభివృద్ధి సాధిస్తామని చెబుతోంది. చదువుకున్న పిల్లలకు ఉద్యోగ, ఉపాధి కనిపించడం లేదు. జిల్లాలో కృష్ణపట్నం పోర్టు ఒకప్పటిలా కనిపించడం లేదు. కంటైనర్ టెర్మినల్ ఇక్కడ నుంచి వెళ్లిపోయిన కారణంగా 15 వేల మందికి ఉపాధి, ఉద్యోగం కోల్పోయారు. కొత్తగా పరిశ్రమలు వచ్చి, యువతకు అవకాశాలు కల్పించాల్సి ఉంది. జాతీయ రహదారి పక్కన కిసాన్‌సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న 2770 ఎకరాల్లో పరిశ్రమలను ప్రోత్సహిస్తే సుమారు 50 నుంచి 60 వేల మంది యువతకు ఉద్యోగం, ఉపాధి లభిస్తుందని సమాచారం. కొన్ని పరిశ్రమలు ముందుకొస్తున్నా, ప్రభుత్వ సానుకూలత చూపని కారణంగా వెనక్కి వెళుతున్నాయని తెలుస్తోంది. కృష్ణపట్నం సెజ్‌లో నూతన పరిశ్రమలకు అవకాశం కల్పించాలి, రామాయపట్నం, బిపిసిఎల్ వంటి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. నెల్లూరు జిల్లా యువతను 20 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మభ్యపెడుతూనే ఉన్నాయి., ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు పెద్దపీట వేయాలని యువత కోరుతున్నారు...

నేడు చంద్రబాబు రాక...!

ముఖ్యమంత్రి ఎన్, చంద్రబాబునాయుడు ఒక్క రోజు పర్యటన నిమిత్తం నెల్లూరు రానున్నారు. నెల్లూరు నగరం, సర్వేపల్లి నియోజవర్గాల్లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కోవూరు సుగర్‌ఫ్యాక్టరీలో దిగుతారు. మైపాడు గేట్ వద్ద స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్‌ను ప్రారంభిస్తారు. అక్కడ నుంచి వెంకటాచలం ఈదగాలిలో నందగోకులం లైఫ్ స్కూల్‌ను సందర్శిసారు. విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు. సిఎం పర్యటనకు మంత్రి పి, నారాయణ, ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోన్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.



నేటి నుంచి ఆరోగ్య సేవలు బంద్..!

○ఏడాది నుంచి బిల్లులు పెండింగ్
○గన్ ప్రభుత్వంలో బిల్లులపై సంసిద్ధత
○మేం ఆరోగ్య సేవలు నడపలేం- ఆషా

రాష్ట్ర ప్రభుత్వం .ఏడాది నుంచి ఎన్‌టిఆర్ వైద్యసేవల నెట్ వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకపోవడంతో నేటి నుంచి ఆరోగ్యసేవలు నిలుపుదల చేయడానికి సిద్ధమయ్యారు..ఇప్పటికే ధరలు భారీగా పెరిగాయని, ప్రభుత్వం పాత ధరలే ఇస్తున్నా, నెలవారి బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు.ఆరోగ్యశ్రీ సేవలు శుక్రవారం నుంచి నిలుపుదల చేస్తున్నామని ఎపి స్పెషాలిటీ ఆసుపత్రి అసోసియేషన్ (ఆషా) ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాలోని 35 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు నిలిచిపోనున్నాయి. రాష్ట్ర వ్యాపితంగా రూ 2700 కోట్లు బకాయిలుండగా, నెల్లూరు జిల్లాలో వందల కోట్లు బకాయి ఉన్నట్లు సమాచారం. జగన్ ప్రభుత్వంలో బకాయిల విషయంలో ప్రభుత్వం స్పష్టం చేయలేదని తెలిసింది. ఈ నిర్ణయంతో ఆరోగ్యసేవలు అందుకుంటున్న రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవల విషయంలో ఇబ్బందులు పడుతోంది. ఇదిగో అదిగో అంటూ వచ్చినా ఏడాది నుంచి బిల్లులు విడుదల కానట్లు తెలిసింది. 2005 నుంచి రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం అమలు జరుగుతోంది. నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో అనేక అసుపత్రులు వైద్యసేవల నుంచి తప్పుకున్నాయి. నగరంలోని అపోలో, బొల్లినేని ఆసుపత్రులు ఎప్పుడో ఆరోగ్య శ్రీ నుంచి తప్పుకున్నాయి. జిల్లాలో 10 కార్పొరేట్ ఆసుపత్రులతోపాటు 35 నెట్‌వర్క్ ఆసుపత్రులు వైద్యసేవలు అందిస్తున్నాయి. దంత, కంటి వైద్యులు ఆరోగ్య శ్రీ క్రింద వైద్యం చేస్తున్నారు.. ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభించినప్పటి నుంచి ఫ్యాకేజీ పెరగలేదని ఆసుపత్రివర్గాలు చెబుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.5 లక్షలు ఉన్నదానిని రూ.25 లక్షలకు పెంచారు. అనేక నిబంధనలు పెట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సేవలను రూ.25 లక్షలకు పెంచింది. ఇందులో రూ.2.50లక్షల వరకు ఇన్సూరెన్స్ కంపెనీలు కవర్ చేస్తుండగా, రూ.25 లక్షల వరకు ఆరోగ్య ట్రస్ట్ ద్వారా ఇస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

2010 నాటి ప్యాకేజీనే...!

రాష్ట్రంలో ఎన్‌టిఆర్ వైద్యసేవలందిస్తున్న ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి ఉన్న బిల్లులే చెల్లిస్తున్నారు. 2010 నుంచి ఖర్చులు భారీగా పెరిగాయని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదని ప్రయివేటు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. 2010లో డిస్పోజల్ , సిరంజ్ రూ.10 ఉంటే, ప్రస్తుతం రూ.22 కు పెరిగింది. ఐవి కాన్యులా రూ.22 నుంచి రూ.40కి, సిరంజి 5 ఎంఎల్, 10 ఎంఎల్ రూ.3 నుంచి రూ.6, నార్మల్ సెలైన్ 500 ఎంఎల్ రూ.20 నుంచి రూ.40, కుట్లు వేసే మెటిరీయల్ రూ.135 నుంచి రూ.325, ట్రస్ట్‌తో ఎంఒయు ఖర్చులు రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెరిగినట్లు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. 2010 నుంచి ఖర్చులు పెరిగినా అందుకు అనుగుణంగా ప్రభుత్వం బిల్లులు పెంచకపోగా, ప్రతి నెలా ఇవ్వాల్సిన బిల్లులు రావడం లేదంటున్నారు. 2010లో అడ్మిషన్లు 20 శాతం ఉంటే, ప్రస్తుతం అవి 80 శాతానికి పెరిగినట్లు సమా చారం. ఒక్కో ఆసుపత్రికి ప్రతి నెలా రూ.2 నుంచి రూ. 5 కోట్లు ఆదనపు భారం పడుతోందని తెలుస్తోంది. .



మేం వైద్యసేవలు చేయలేం..

డాక్టర్ నారాయణరావు

ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవడం లేదని, 10వతేదీ నుంచి వైద్యసేవలు నిలిపేస్తున్నట్లు ఎపి స్పెషాలిటీ ఆసుపత్రుల ఆసోసియేషన్ (ఆషా) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌విఎల్ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వానికి తమ ఇబ్బందులు తెలిపామని, ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తుందన్నారు. ఇటీవల తమ ప్రతినిధులు కలెక్టర్లు, మంత్రులు, ఎంఎల్ఎలకు చెప్పినా ఎలాంటి ప్రయోజనమూ లేదని అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రోగులకు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోలీస్ క్రీడలకు
న్యాయనిర్ణేతగా అఖిల్ ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెల 10వ నుంచి 14వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్లోని శ్రీనగర్లో జరగబోవు 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ టోర్నమెంట్ కు కందుకూరుకి చెందిన పి అఖిల్ న్యాయనిర్ణేతగా వ్యవహరించబోతున్నారని ఎపి తైక్వాండో వైస్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శి ఎస్‌కె అబ్దుల్ సలాం తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ టోర్నమెంట్ లో మన రాష్ట్రం నుండి ఒక్కరే అర్హత సాధించడం అది కూడా కందుకూరు చెందిన వ్యక్తి కావడం చాలా సంతోషకరమని సలాం తెలిపారు. అఖిల్ ను జిల్లా అధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, జిల్లా తైక్వాండో సలహాదారులు గోనుగుంట వెంకటేశ్వర్లు,కార్యదర్శి అబ్దుల్ సలాం, సహచర శిక్షకులు అభినందించారు.



పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రాజెక్టు సెక్టార్ లోని రెవెన్యూ కాలని అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ ఉషారాణి ఆదేశాల మేరకు సూపర్ వైజర్ షేక్ షకీలా బేగం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఊబకాయం ఉన్న వాళ్ళు నూనెలు చక్కెర వినియోగం తగ్గించాలని, చిరుధాన్యాలు ,ఆకుకూరల, కూరగాయలు ,పండ్లు ఎక్కువగా వాడాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత ,నీలిమ ,ఈశ్వరమ్మ, పుష్పలత ,రోహిణి, సుజాత, గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు.



కందుకూరు ప్రాజెక్ట్ అర్బన్ బి సెక్టార్ లోని చాకలి పాలెం అంగన్వాడీ కేంద్రంలో సి డి పి ఓ కే ఉషారాణి ఆదేశాల మేరకు రాష్ట్రీయ ఎనిమిదవ పోషణ మాహ్ ప్రోగ్రామ్ నిర్వహించాచరు.సూపర్‌వైజర్ ఎల్ లక్ష్మి దేవి మాట్లాడారు. అంగన్‌శాడీ కార్యకర్త ఎం బేబీ ఝాన్సీ, ఆయా రమాదేవి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు
'కెజిబివి' విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని వాణి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -19 అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కిలారి.సింధు తెలిపారు. ఈనెల 7న సింగరాయకొండ ప్రభుత్వం జూనియర్ కళాశాల పాఠశాలలో ఆట స్థలం లో జరిగిన అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో బాలికల విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో ఇంటర్ ద్వితీయ చదువుతున్న తాట.వాణి రెండవ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆ విద్యార్థిని వచ్చే నెలలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 19 పోటీల్లో పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి చెప్పారు. ఆ విద్యార్థిని ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బి. వెంకటేశ్వరమ్మ, తల్లిదండ్రులు , గ్రామస్తులు అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పాఠశాల స్థాయి 8, 9,10, తరగతుల విద్యార్థిని విద్యార్థులకు చెకుముకి సంబారలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది ఈ సంబరాల నిర్వహణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం జిల్లా విద్యాశా ఖాధికారి బాలాజీరావు ఆవిష్కరించారు.. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, జిల్లా ఎంఇఒ తిరుపాల్,మురళి, జన విజ్ఞాన వేదిక జిల్లా నగర నాయకులు పాల్గొన్నారు.



సిఐటియు జిల్లా మహాసభల
ప్రచార జాతా ప్రారంభం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న నెల్లూరు జిల్లా సిఐటియు 12వ మ హాసభలను పురస్కరించుకొని గురు వారం ప్రజానాట్యమండలి కళాకారులు ఆధ్వర్యంలో ప్ర చార జాతా జరిగింది. ప్రచార జాతాను సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీవీ ప్రసాద్, సిఐటియు మండల కార్య దర్శి మారుబోయిన రాజాలు జెండా ఊపి ప్రారంభిం చారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జి. శే షయ్య సిఐటియు పాటలను ఆలపించారు. అనంతరం చింతో పు, ముంగల దొరువు, ఆములూరు, పొట్లపూడి, కొత్తపాలెం వెంకన్నపాలెం, మహాలక్ష్మిపురం, కోడూరు, నె ల్లిమిట్ట కండ్రిగ వరకు ప్రచార జాతా కొనసాగింది. కళా కారుల జాత సిఐటియు మహాసభలను ఉద్దేశించి పాటలు ఆలపిస్తూ జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, రాజాలు మాట్లాడుతూ తోటపల్లిగూ డూరు మండలం, నరుకూరు సెంటర్లో శుభం ఫంక్షన్ హ ల్ లో రెండు రోజులపాటు ఈ మహా సభలు జరుగుతా యని తెలిపారు. 11వ తేదీ మధ్యాహ్నం రెం డు గంటలకు నరుకూరు అంబేద్కర్ విగ్రహం నుండి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్‌ల్ వి లేఅవుట్ లో బహిరంగ సభ జరుగుతుం దన్నారు. ఈ మహా సభలకు అన్ని విభాగాల కార్మికులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, ప్రభావతమ్మ, చిన్నబ్బయ్య, నరుకూరు ఆటో యూనియన్ అధ్యక్షులు పరశురామయ్య, సుబ్బయ్య, నారాయణ, డప్పు కళాకారులు, ప్రజానా ట్య మండలి కళాకారులు, వెంకన్నపాలెం యాగ్జలరీ శా ఖ కార్యదర్శి చింతా రామసుబ్బయ్య, అశోక్, మనోహర్ పాల్గొన్నారు.



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న నాయకులు

హెచ్‌ఐవి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఉలవపాడు : మండలంలోని భీమవరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో హెచ్ ఐ వి, ఎయిడ్స్ మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. హెచ్ ఐ వి ఇన్ ఎయిడ్స్ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత ఇలాంటి వ్యాధుల భారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక లింక్ వర్కర్ వీరమల్లు రవీంద్ర మాట్లాడుతూ హెచ్ ఐ వి వ్యాధిగ్రస్తులపట్ల వివక్ష చూపొద్దన్నారు.


వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : బుజబుజ నెల్లూరు వద్ద ఉన్న వాటర్ ప్లాంట్ మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని డిమాండ్ చేస్తూ సిపిఎం్ల 25వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరు లోని ఇంటింటికి కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుకె పెంచల నరసయ్య మాట్లాడారు. మాట్లాడుతూ బుజబుజ నెల్లూరులో దాదాపు 20,000 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రతి ఒక్కరు నిరుపేదలే అన్నారు. ఆ ప్రాంతంలో నీరు నాణ్యతలేని కారణంగా ప్రజలు ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న విషయాన్ని గుర్తించి 2009లో న్యూ ఢిల్లీ ,భారత ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ విభాగం వార్ ప్రాజెక్టులో భాగంగా రూ.4 కోట్లు ఖర్చు చేసి దేశంలోనే అతి పెద్ద మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిందన్నారు. ప్లాంట్ లోని మిషనరీ చిన్నచిన్న మరమ్మత్తులకు గురైన సమయంలో పాలకులు, అధికారుల మధ్య సరైన అవగాహన లేని కారణంగా పరికరాలు తుప్పు పట్టిపోయా యన్నారు. కేవలం రూ.14 లక్షలు ఖర్చు పెడితే ఈ వాటర్ ప్లాంట్ పని ప్రారంభించి స్థానిక ప్రజలకు నాణ్యమైన నీటినిన సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ ను వెంటనే మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు కె. పెంచల నరసయ్య, ఎస్కే ఖలీల్, నాగేశ్వర్ రెడ్డి, మాలకొండయ్య, నరసింహారెడ్డి, కష్ణమూర్తి, తిరుపాలు, ఎస్ వెంకయ్య, ఓబుల్రెడ్డి, శ్రీనివాసులు, నారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



భూ సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి -గుడ్లూరు : మండలంలో గతంలో జరిగిన రీ సర్వేలో జరిగిన తప్పులను సరి దిద్ది రైతులు ఎదుర్కొంటున్న భూమి సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని తహశీల్దార్ విజయ భాస్కర్ తెలిపారు. గుడ్లూరు మండల అభివద్ధి కార్యాలయంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ప్రజా ప్రతినిధులు రైతులు ఎదుర్కొంటున్న భూమి సమస్యలు పరిష్కారం చేయాలని రెవిన్యూ అధికారులు దష్టికి తీసుకువచ్చారు గుడ్లూరు మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా 11 గ్రామాల్లో మాత్రమే రీ సర్వే జరిగిందని మిగతా ఏడు గ్రామాల్లో భూములు రీ సర్వే చేస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు మండలంలోని చేవూరు రావూరు రామాయపట్నం పోర్టుకు సంబంధించి భూ సేకరణ పనులు చూడాల్సి రావటంతో రెవిన్యూ అధికారులకి పని ఒత్తిడి ఎక్కువైందని, సన్న,చిన్నకారు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దష్టి సారించి భూమి సమస్యలు పరిష్కారం చేస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. గుడ్లూరు రాళ్లపాడు భారీ మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు మురుగునీరుగా మారి వస్తున్నాయని నీరు దుర్గంధం దుర్వాసన వస్తున్నాయని గుడ్లూరు బసిరెడ్డి పాలెం ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చారు. సమస్యకు పరిష్కారం చూడాలని గుడ్లూరు ఎంపిటిసి సభ్యురాలు వరమ్మ డిమాండ్ చేశారు. విద్యుత్ లైన్ల సమస్యపై పడుకుంటపాడు పాజెర్ల గ్రామ సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. విద్యుత్ అధికారులు గత మూడు సర్వసభ్య సమావేశం సమావేశాలకు హాజరు కాకుండా గైరాజరుగుతున్నారని ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు తెలిపారు. పభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించే బాధ్యత సర్పంచులు తీసుకొని సహకరించాలని ఎంఇఒ హరి రామ్ కోరారు.ఉద్యానవన పంటలపై ఆ శాఖాధికారులు మాట్లాడారు. ఏవో రవికుమార్ సర్పంచులు కార్యదర్శులు ఐసిడిఎస్ అధికారులు వైద్య ఆరోగ్యశాఖ సీ హెచ్ ఓ ఉన్నారు.



షోకాజ్ నోటీసులు జారీ

సర్వసభ్య సమావేశానికి రోడ్లు భవనాల శాఖ, ఫారెస్ట్ అడవి శాఖ ఎక్సైజ్ శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. వారందకిరీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు తెలిపారు.

గిరిజనులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజనులకు ఉచిత కరెంటు సరఫరా చేస్తామంటూ ఆర్భాటంగా హామీలు చేసిన నాయకులు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం విస్మరించిందని శాఖ కార్యదర్శి ఎం చిరంజీవి, నగర కమిటీ సభ్యులు నరసింహలు పేర్కొన్నారు. గురువారం 5వ డివిజన్ ప్రాంతంలోని వైకుంఠపురం ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు పక్కకు వాలిపోయి ఉన్నాయని, వీటిని సరిచేయని పక్షంలో ప్రాణ నష్టం కలిగే ప్రమాదం ఉందని, ఆ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి వాలిన స్థంబాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్ వన్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సమస్యను అధికారులకు వివరించి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సిపిఎం 5వ డివిజన్ శాఖ సభ్యులు రాంబాబు, అబ్బన్న ,నాగయ్య తదితరులు పాల్గొన్నారు



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టౌన్ లోని ఓవిరోడ్‌లో రోడ్డు వైండింగ్ వర్క్స్ జరుగుతున్నందువలన 11 కెవి ఎంఆర్‌ఓ ఆఫీస్ ఫీడర్ నందు ఉదయము 06:30 నుండి మధ్యాహ్నము2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని అసిస్టెంట్ ఇంజనీర్ టివి నరసింహం తెలిపారు..ఆ ఫీడర్ పరిధిలో ఉన్నటువంటి సుల్తాన్ మొహిద్దీన్ హాస్పిటల్ ఏరియా, సంతోష్ నగర్, మక్కా మసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, బూడిద పాలెం, పాత బ్యాంకు బజారు, కోట కట్ట వీధి,అన్నా క్యాంటీన్ ఏరియా, పెద్ద బజార్ లోని కొంత భాగం తదితర ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ నియోజకవర్గం పరిధిలోని పడారుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ లోని గురువారం ఆశా కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ సిఐటియు ఆల్ ఇండియా మహాసభల కర్తవ్యాలను సభ్యులకు తెలియజేశారు. ఈ నెల 11,12 తేదిలల్లో నరుకూరు సెంటర్‌లో సిఐటియు జిల్లా మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం 9 మందితో కమిటీ ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా శాంతి, ఉమా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్షులు ఎం సుధాకర్ మహిళా సంఘం రూరల్ కార్యదర్శి షేక్ షాహినా బేగం పాల్గొన్నారు



నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి -గుడ్లూరు : మండలంలోని రాళ్లపాడు ,గొల్లపాలెం మధ్యలో దారకానిపాడుకు చెందిన తిరుమల శెట్టి లక్ష్మీ నాయుడు (25)ను కారుతో ఢీ కొట్టించి దారుణంగా హత్య చేసిన నిందితులు కాకర్ల హరిచంద్ర ప్రసాద్, కాకర్ల మాధవిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. కందుకూరు కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితులకు రిమాండ్ విధించినట్లు సీఐ మంగారావ్ ఎస్ఐ వెంకటరావు తెలిపారు.

నేడు స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రారంభం

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ : సిఎం నారా చంద్రబాబు నాయుడు నేడు నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌లో స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సిఎంఒ బృందంతో కలిసి రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పి అజితా వేజండ్ల, కమిషనర్ నందన్,మెప్మా పీడీలకు మంత్రి సూచనలు చేశారు.

విద్యుత్ లైన్ మార్పు..

- హామీ నెరవేర్చిన ఎంఎల్ఎ కాకర్ల సురేష్



ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని అన్నవరం అరుంధతీయవాడలో విద్యుత్ లైన్ మార్చడంతో ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఇచ్చిన హామీ నెరవేరడంతో ఆనందం నెలకొంది. గత 25 సంవత్సరాల నుంచి ఎంఎల్ఎలు మారుతున్నారే తప్ప 11 కె.వి. సమస్యను పట్టించుకున్న వారు ఎవరూ లేరని, ఎంఎల్ఎ కాకర్ల సురేష్ తమ హామీని నెరవేర్చడంతో అరుంధతీయవాడలో ఆనందం నెలకొంది. తమ కాలనీలోని గృహాలపై ఏర్పాటై ఉన్న 11 కెవి విద్యుత్ వైర్‌ను మార్పు చేయాలని మార్పు చేయాలని సుదీర్ఘకాలంగా అధికారులకు ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చైర్మన్ అన్నవరం టిడిపి నాయకులు, జలదంకి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పూనూరు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో అరుంధతీయవాడ పెద్దలంతా కలిసి ఇటీవల ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. వర్షాలకు ఈదురు గాలులకు తమ ఇళ్లపై విద్యుత్ సరఫరా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఇంటి గోడలకు విద్యుత్ సరఫరా జరగడం వల్ల ఇళ్లల్లో ఉండలేని దుస్థితి నెలకొందని వాపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు పొరుగిళ్లలో తలదాచుకోవాల్సి వస్తుందని ఆవేదన వెళ్లిబుచ్చారు. వేసవికాలంలో ఇప్పటివరకు ఇళ్ల మీద నిద్రించిన దాఖలాలు లేవన్నారు. ఎంతమందికి తమగోడు వెళ్లబోసుకున్న పట్టించుకునేవారు కరువైనారని కన్నీటి పర్యంతమయ్యారు. వీరి దినస్థితికి చెల్లించిన ఎంఎల్ఎ యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం జలదంకి పిఎసిఎస్ అధ్యక్షులు కరియావుల అప్పలనాయుడును దగ్గరుండి పనులు పర్యవేక్షించాలని సూచించారు. ఎంఎల్ఎ ఆదేశాలతో అప్పలనాయుడు, జలదంకి మండల ఎస్‌సిసెల్ అధ్యక్షులు వేల్పుల వేణుగోపాల్‌తో కలిసి సంబంధిత అధికారులను పురమాయించుకొని కాలనీలో ఏర్పాటై ఉన్న 11 కె.వి. విద్యుత్ వైర్లను పరిశీలించారు. విద్యుత్తు లైను ఎటువైపుకు మార్చాలనే ప్రణాళికలను దగ్గరుండి సిద్ధం చేయించారు. అరుంధతీయవాడపై వెళుతున్న 11 కేవీ వైరును తొలగించి బుధవారం అర్ధరాత్రికి వేరే వైపునకు మార్చడంతో అరుంధతీయుల్లో ఆనందం వెల్లువెరిసింది. విద్యుత్ లైన్ మార్పుపనుల పర్యవేక్షణలో గ్రామానికి చెందిన జలదంకి మండల ఎస్‌సిసెల్ అధ్యక్షులు వేల్పుల వేణుగోపాల్, వేమిరెడ్డి మాలకొండ రెడ్డి, వేల్పుల ధనుంజయ, గోచిపాతల వెంకట కృష్ణయ్య తదితరులు తమవంతు సహాయ సహకారాలు అందజేశారు. ఎంఎల్ఎ ఇచ్చిన మాట నెరవేర్చడంతో అరుంధతీయవాడ పెద్దలు ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు, పిఎసిఎస్ చైర్మన్ కరియావుల అప్పలనాయుడుకు, స్థానిక సిబిఆర్ చైర్మన్ పూనూరు భాస్కర్ రెడ్డికి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు వేల్పుల వేణుగోపాల్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు.

జ్ఞానమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మకూరు నియోజకవర్గంలో మే 1వ తేదీ ఆత్మకూరు నియోజకవర్గం ఆత్మకూరు మండలంలోని చెర్లో యడవల్లి గ్రామానికి చెందిన గిరిజన కుటుంబమైన కత్తి జ్ఞానమ్మను బంగారు కుటుంబంలో ఎంపిక చేసి వారి అభివృద్ధికి మార్గదర్శిని జత కలిపిన విషయం తెలిసిందే. ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని పి-4 పథకాన్ని ప్రతిష్టాత్మకంగా స్వీకరించి జ్ఞానమ్మ కుటుంబాన్ని దాత నాగేశ్వరరావు సహకారంతో వారి జీవన అభివృద్ధికి రూ.లక్ష సహకారం అందించి మేకలను అందించి వారి కుటుంబ పోషణకు తోడ్పాటు అందించారు. ఆ క్రమంలో ముఖ్యమంత్రి జ్ఞానమ్మకు ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం చెర్లో ఎడవల్లి గ్రామం కత్తి జ్ఞానమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. కత్తి జ్ఞానమ్మ, సుబ్రహ్మణ్యం దంపతులచే శంకుస్థాపన చేయించిన ఆర్‌డిఒ బి.పావని ఇంటి నిర్మాణం త్వరగా జరిగేలా సహకారం అందించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి టిడిపి సీనియర్ నాయకులు కేత విజయ భాస్కర్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ అధికారులు ఇఇ మోహన్ రావు, డిఇఇ కె.రవి, ఎఇ శరత్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు


ప్రజాశక్తి-కావలి : వి.ఎస్.యు. కావలి పి.జి. కళాశాలలోని డాక్టర్ ఎం.సుశీల, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పుదుచ్చేరి ప్రభుత్వం, "సేవ పర్వ్ కంపెయిన్"లో భాగంగా 17 సెప్టెంబర్ 2025 నుండి 2 అక్టోబర్ 2025 వరకు నిర్వహించిన వ్యాస రచన పోటీలో వి.ఎస్.యు, కావలి పి.జి. కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిలో జి.వంశీ, పి.శశికళ, వి.రేవతి విజేతలుగా నిలువగా, సిహెచ్. అనుష, జి.సౌందర్య, ఆర్.ఇందు, ఎస్.దివ్య, యన్.అభిలాష్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిలుమూరు శ్రీనివాసరావు అభినందించి, ఇంకా ఇలాంటి ఎన్నో కార్యక్రమాలలో పాల్గొని గుర్తింపు తెచ్చుకోవాలని తెలియజేశారు.

కబడ్డీ టీంకు అభినందనలు



ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ : రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం బెహల్గావి కర్ణాటకలో జరిగిన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయల కబడ్డీ పోటీలలో పాల్గొని ఐదు రౌండ్లు విజయం సాధించిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టును వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కనుమూరి సునీత అభినందించారు. అక్టోబర్ 4వ తేదీ నుండి 7వ తేదీ వరకు జరిగిన టోర్నమెంట్‌లో విజయం సాధించి నెల్లూరు చేరుకున్న కబడ్డీ టీం మునుపెన్నడూ సాధించలేని విజయాన్ని సాధించినందుకు క్రీడాకారులను కోచ్ మేనేజర్లను అభినందించారు. మరీముఖ్యంగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కబడ్డీ టీంలో డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల క్రీడాకారులు ఐదుగురు ఉండడంతో కళాశాల పిడి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లును క్రీడాకారులను అభినందించారు. గురువారం ఎస్ఆర్‌జెడి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్.రాధాకృష్ణయ్య ప్రిన్సిపల్ ఇన్‌ఛార్జి డాక్టర్ టి.శ్రీనివాసుల రెడ్డి క్రీడాకారులను అభినందించారు.

పోలీసుల తీరుపై గ్రామస్తుల ఆవేదన



ప్రజాశక్తి-జలదంకి : టెక్నాలజీ అందుబాటులో ఉన్నా గుడిలో చోరీ సొత్తును రికవరీ చేయడంలో జలదంకి పోలీసు అధికారులు ఉదాసీనంగా ఉన్నారని అన్నవరం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పూనూరు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గుడిలో, గుడి పరిసరాలలో సిసి కెమెరాలు ఉన్నాయని, ఆరోజు సిసి కెమెరాలు పరిశీలిస్తే విషయాలు బయటికి వస్తాయన్నారు. పెద్దపెద్ద చోరీలలో కూడా ఆధునిక టెక్నాలజీ సాయంతో విషయాలు పోలీసులు బట్టబయలు చేసిన దాఖలాలు ఉన్నాయన్నారు. సిసి ఫుట్టేజీలు పరిశీలించి కూడా చోరీకి పాల్పడిన దొంగను పట్టుకోలేదని పోలీసుల తీరును తెలియజేశారు. ఇప్పటికైనా చోరీ సొత్తును రికవరీ చేయాలని, కాని పక్షంలో జిల్లా ఎస్‌పి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అన్నవరం 8వ రేషన్ షాపులో రేషన్ బియ్యం అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కంచి కృష్ణారెడ్డి, దేవరపల్లి రమణారెడ్డి, చొప్పర శ్రీనయ్య, ఆలయ పూజారి వెంకట శివ ప్రసాద్, పెద్ద అంజయ్య, మాల కొండయ్య, షేక్ నాగూర్, రామమూర్తి పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కావలి : 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ సహకారంతో ముసునూరు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, చంద్రబాబు నాయుడు కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా పోషకాహారాల ఎక్సిబిషన్, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, లింగ నిర్ధారణ నిషేధ కమిటీ సభ్యుడుయం.మాలకొండారెడ్డి, ఐసిడియస్ సూపర్ వైజర్ సుభాషిణి, అంగన్ వాడీ టీచర్లు రమాదేవి, దీనకుమారి, శివలీల, సుశీల, విజయలత, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర కేంద్రం ఏర్పాటు


ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రలోని అరుంధతీయవాడ ప్రాథమిక పాఠశాలలో అక్షర కేంద్రాన్ని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువు విలువను గ్రహించి అక్షర కేంద్రం ద్వారా చదవడం రాయడం నేర్చుకొని నిత్యజీవితంలో ఉపయోగించు కోవాలని అభ్యాసకులకు తెలియజేశారు. అరుంధతీయవాడ పరిధిలో నిర్వహిస్తున్న కేంద్రానికి స్వచ్ఛందంగా అభ్యాసకులకు నేర్పించడానికి ముందుకు వచ్చిన కె.నవీన్‌ను ఎంపిడిఒ అభినందించారు.

గంధ మహోత్సవం

ప్రజాశక్తి - ఉదయగిరి : అస్తానా ఖాదరీయాలో గురువారం స్థానిక హజరత్ గౌసులాజం దస్తగీర్ గ్యారవీ షరీఫ్ సందర్భంగా గంధ మహోత్సవంను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఖాదరియా ఆస్తాన అధ్యక్షులు అహమద్ బాషా ఖాలిది, మిఠాయిగిరి అహమద్, ఫరుద్దీన్, ఉస్మాన్‌అలీ, నజీర్,జలీల్, జిల్లా మైనారిటీ నాయకుడు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యు రహదారి..

- బద్వేలు- శింగరాయకొండ హైవేలో నిత్యం ప్రమాదాలు
- నెల వ్యవధిలో 20 మంది మృతి
- నాలుగు రోడ్లు, డివైడర్లు లేకపోవడమే కారణం



రోడ్డు ప్రమాదాలకి కారణమవుతున్న ఎన్‌హెచ్ 167 రోడ్డు ఇదే...

ప్రజాశక్తి-కందుకూరు

బద్వేలు - శింగరాయకొండ జాతీయ రహదారి మృత్యు కుహరంగా మారింది. ఆ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేకమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఎన్ హెచ్ 167బి రోడ్డు రాకపోకలు ప్రారంభమై కొన్ని నెలలు మాత్రమే అయింది. ఈ కొద్ది నెలల్లోనే దాదాపు 20 మందికి పైగా మృతిచెందారు. తాజాగా అక్టోబర్ 4 రాత్రి ఒంగోలుకు చెందిన కొరియర్ బాయ్ పొదిలి భార్గవ నాథ్ (30) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కొరియర్ కందుకూర్లో డెలివరీ చేసి ఒంగోలు తిరిగి వెళ్తుండగా కందుకూరు వైపు వస్తున్న నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సు రవిగార్డెన్ వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భార్గవనాథ్ అక్కడికక్కడే మృతి చెందారు. అక్టోబర్ 2న దసరా రోజు ఇదే జాతీయ రహదారిలోని కందుకూరు మండలం ఓగూరు గ్రామం వద్ద కారు - మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో కందుకూరు పట్టణం సాయినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వై అశోక్ (51) మరణించాడు. 2005లో అశోక్ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘంలో కీలకంగా పనిచేస్తున్నాడు. అక్టోబర్ 3న రాత్రి కందుకూరు పట్టణం జనార్ధన కాలనీకి చెందిన సాధుసాయి అనే యువకుడు కందుకూరు మండలం, పలుకూరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు పాలయ్యాడు. మోటార్ సైకిల్‌పై వస్తున్న సాయిని ఆటో ఢీకొనడంతో గాయాలు కాగా కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాల తో ఉన్న సాయిని వెంటనే ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాలు ఎముకలు ఇరగడంతో రిమ్స్ డాక్టర్ల సూచన మేరకు ఒంగోలు వెంకటరమణ నర్సింగ్ హోమ్‌కు తరలించారు. సాయి కాలు ఎముకలు విరగడంతో ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల కిందట ఇదే రహదారిలోని రవి గార్డెన్ వద్ద కారులో ఒక కుటుంబం ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కందుకూరు పట్టణం బూడిద పాలకు చెందిన ఓ ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయురాలు చనిపోయింది. మూడు నెలల కిందట ఇదే జాతీయ రహదారిపై వలేటివారిపాలెంకు చెందిన భార్య భర్తలు కారులో ప్రయాణిస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. భార్య చనిపోగా, భర్త తీవ్రగాయాలు కావడంతో నెల్లూరు అపోలో ఆస్పత్రిలో మేజర్ అపరేషన్ చేశారు. లక్షల రూపాయల ఖర్చు పెట్టి బతికించాల్సి వచ్చింది. చుట్టుగుంట గ్రామ అడ్డరోడ్డు వద్ద స్కూటర్‌పై వస్తు ప్రమాదానికి గురై కందుకూరు పట్టణం ఆర్యవైశ్య బజార్‌కి చెందిన (46) వయసుగల వ్యక్తి మరణించాడు. ఆరు నెలల కిందట వలేటివారి పాలెం మండలం, సింగంపల్లి గ్రామానికి చెందిన యువకుడు బడేవారిపాలెం గ్రామంవద్ద రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఇలా ఎన్ హెచ్ 167బి రోడ్ లో కొన్ని నెలల్లో 20 మందికి పైగా మరణించగా, గాయాల పాలైన వారు వందల సంఖ్యలో ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో మరణించిన పొదిలి భార్గవ నాథ్



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మరణించిన టీచర్ అశోక్ (ఫైల్)

నాలుగు రోడ్లు, డివైడర్లు లేకపోవడమే..

కొత్తగా నిర్మించిన జాతీయ రహదారి మూడు రోడ్లుగా ఉన్నందునే వాహనం దారులు కన్ఫ్యూజ్ కావడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి నాలుగు రోడ్లుగా నిర్మించి మధ్య డివైడర్లు ఏర్పాటు చేసి ఉంటే ఈ ప్రమాదాలు జరగవు. మూడు రోడ్లుగా నిర్మించడం వల్ల వాహనం దారులు ఓవర్టేక్ చేయడానికి ప్రయత్నించడం వల్లనే అనేక ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇక రోడ్లు కలిసే గ్రామాలకు పోయే చోట అండర్‌పాస్ బ్రిడ్జిలు సింగరాయకొండ నుండి పామూరు వరకు ఎక్కడ ఏర్పాటు చేయలేదు. దానివల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశం వుంది. ప్రజలు ప్రాణాలు పెద్ద సంఖ్యలో పోతున్నప్పటికీ పోలీసులు, జాతీయ రహదారి నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలు ఏమీ లేవు.

రోడ్డు నిర్మాణాలకు రూ.14.11 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న డిఇఇ దాసరి శ్రీనివాసరావు

గ్రామీణ ప్రాంతాలలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను నూతనంగా నిర్మించేందుకు ప్రభుత్వం పల్లె పండుగ పథకం కింద రూ.14.11 కోట్లు నిధులు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ శాఖ కావలి సబ్ డివిజన్ డిఇఇ దాసరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ రోడ్లను నూతనంగా నిర్మించేందుకు ప్రథమ ప్రాధాన్యతతో పని చేస్తుందన్నారు. కావలి సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా చేపట్టిన పనులు, మంజూరైన నిధుల వివరాలను ఆయన వెల్లడించారు. ఏడాది క్రితం గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించిన గ్రామసభల్లో కావలి రూరల్ మండలంలో 54 పనులను గుర్తించగా, వాటికి రూ.722.08 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. బోగోలు మండలంలో 32 పనులకు గానూ రూ.235.50 లక్షలు, దగదర్తి మండలంలో 96 పనులకు గానూ రూ.372.60 లక్షలు, అల్లూరు మండలం లో 19 పనులకు గానూ రూ.81.40 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తంగా కావలి సబ్ డివిజన్ పరిధిలో 201 పనులు గుర్తించగా ఇప్పటికే 165 పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. 36 పనులు పెండింగ్ ఉండగా వాటిని కూడా నెలాఖరులోగా పూర్తి చేసేలా ప్రణాళికా బద్ధంగా ముందు కెళ్తున్నట్లు పంచాయతీరాజ్ డిఇఇ డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జోరుగా కోడి పందేలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని పలు గ్రామాల శివారు ప్రాంతాలలో గుట్టుచప్పుడు కాకుండా జోరుగా కోడిపందేలు కొనసాగుతున్నాయి. ఈ కోడి పందేలలో ప్రధానంగా యువత, ఉద్యోగస్తులు సైతం జోరుగా బెట్టింగ్‌ల పెడుతూ ఉండడం జరుగుతుందని, పలువురు గ్రామస్తులు పత్రిక ముఖంగా వాపోయారు. ఓ పక్క లేకుండా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, మరోపక్క కోడిపందేలు జరుగుతున్న సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం శోచనీయమని టిడిపి నాయకులు సైతం వాపోతున్నారు.

విఆర్‌ఎల దీక్షను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 13, 14 తేదీల్లో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తలపెట్టే దీక్షను విఆర్‌ఎలు పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని విఆర్‌ఎ సంఘం అధ్యక్షులు దుగ్గయ్య డిప్యూటీ తహశీల్దార్ షాజియాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 13వ, 14వ తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట దీక్షలు నిర్వహించి అనంతరం విజయవాడలోని 15వ తేదీ అలంకార్ సెంటర్ దగ్గర రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విఆర్‌ఎలు ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామ సహాయకులకు వెంటనే పేస్కేల్ ఇవ్వాలని అర్హత ఉన్న విఆర్‌ఎలకు విఆర్‌ఒలుగా పదోన్నతి కల్పించి రికార్డ్ అసిస్టెంట్ వాచ్‌మెన్ అటెండర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, డిమాండ్‌తో పాటు ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా నియమించాలని, అటెండర్ నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ కోటాను 20శాతం నుండి 70 శాతం వరకు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. మహిళ విఆర్‌ఎలకు జీతంతో కూడిన 150 రోజులు పసుతి సెలవులు రెండు కాన్పులకు వర్తింపజేయాలని న్యాయమైన విఆర్‌ఎల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పరిష్కరించే దిశగా సహాయ సహకారాలు అందించాలని వినతిపత్రం ద్వారా తెలుపుతున్నామని వివరించారు. కార్యక్రమంలో షేక్ ఇబ్రహీం, వెంగయ్య, పిచ్చయ్య, షేక్ హజరత్, హుస్సేన్ భాషా, ప్రకాశం, శేషయ్య, శ్రీనివాసులు, అరబ్ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి


ప్రజాశక్తి-బిట్రగుంట



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పేడను పూసి అవమానించిన వారిని శిక్షించాలని బోగోలు సిపిఎం శాఖ కార్యదర్శి తిరుమల వెంకయ్య పేర్కొన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మిపురం గ్రామంలో ఉన్న అంబేద్కర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అవమానించినందుకు నిరసనగా బోగోలు సిపిఎం కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల శాఖ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ సాహెబ్ బి, ఆర్ అంబేద్కర్ అట్టడుగున ఉన్న బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఆయన రాసిన రాజ్యాంగం ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన రాసిన రాజ్యాంగంతో ఇప్పుడు ఎంతోమంది పదవులు అనుభవిస్తున్నారని, మహిళలు అన్ని రంగాలలో ముందు ఉన్నారంటే ఆయన రాసిన రాజ్యాంగంలో ఒక భాగమని, మహిళలు అన్ని రంగాలలో పురుషులకు సమానంగా ఉండాలని, అంటరానితనాన్ని రూపుమాపిన వ్యక్తి అని తెలిపారు. దేశంలో ఈ మధ్యకాలంలో ఎక్కువ అంబేద్కర్ విగ్రహాలపై దాడులు చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని, అంబేద్కర్ విగ్రహంపై జరిగిన ఘటనపై బోగోలు సిపిఎం శాఖ ఖండిస్తుందని, ఈ ఘటన ఆరకులైన వారిని ఎస్‌సి, 6 ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో బోగోలు మండల సిఐటియు కార్యదర్శి చల్ల నరహరి, సిఐటియు అధ్యక్షులు బాదుల్లా, సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్.కె అన్వర్ భాషా, మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు సీనయ్య, విశ్వనాథరావుపేట శాఖ కార్యదర్శి ఎన్ రామయ్య, కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, బిట్రగుంట అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నూరుద్దీన్, సిపిఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని మూడో వార్డు ఉలవదిబ్బ ప్రాంతానికి చెందిన టంగుటూరు హజరత్తమ్మ (62) పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమైంది. పక్షవాతంతో ఇబ్బంది పడుతూ మంచానికి పరిమితమైన విషయాన్ని తెలుసుకున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి గురువారం ఆమెకు వీల్‌చైర్ అందజేశారు. వారివెంట చంద్ర వెంకట సుబ్బరాయుడు, ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.



ఆర్‌డిఒకు తీర్మానపత్రం అందజేస్తున్న ఎంపిటిసిలు

వింజమూరు ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి-కావలి

వింజమూరు మండల పరిషత్ అధ్యక్షుడు మోహన్ రెడ్డిపై ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానం చేశారు. ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం ప్రతులను బుధవారం కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణకు 8 మంది ఎంపిటిసిల బృందం గురువారం అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా మండల సమావేశాలు నిర్వహించకపోవడం, అలాగే మండల అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వంటి ఆరోపణలు ఎంపిటీసీలు చేశారు.దీంతో మండల అభివృద్ధి కుంటుపడిందని, ప్రజల సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. అందుకు ఆర్.డి.ఒ. స్పందిస్తూ, 15 రోజులలోగా తగు చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

సిఎం సారూ.. కోవూరు సుగర్ ఫ్యాక్టరీ పతనం మీ పాలనకు చిహ్నామా..?

ప్రజాశక్తి-కోవూరు



ఒకప్పుడు వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన కోవూరు కోఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీ, నేడు మూతపడి శూన్యంగా మారిపోయింది. పది దశాబ్దాల చరిత్ర గల ఫ్యాక్టరీ గోడల మధ్య నిశ్శబ్దమే మారుమోగుతోంది. చక్కెర తీపి గాలి వెదజల్లిన యంత్రాలు ఇప్పుడు దుమ్ము, దూళితో కప్పబడి మౌనంగా ప్రశ్నిస్తున్నాయి "మా కష్టం మర్చిన ఈ ప్రభుత్వం ఎవరి కోసం?" ప్రజల చెమటతో నడిచిన ఫ్యాక్టరీ, ఎన్నికల ముందు ప్రతి నాయకుడు ఫొటోలు, ప్రకటనలతో హామీలిచ్చి, ఎన్నికల తర్వాత తాళం వేసిన గేటు మాత్రమే మిగిలింది. "తిరిగి తెరిపిస్తాం, బకాయిలు చెల్లిస్తాం, పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం" అనే మాటలు చక్కెరల్లా కరిగిపోయాయి," అంటూ కార్మికులు చెమట తీర్చే కన్నీళ్లు చల్లుతున్నారు.

కార్మికుల ఆవేదన

వేతనాలు, గ్రాట్యూటీ, పిఎఫ్, పెన్షన్ ఏదీ సకాలంలో ఇవ్వబడలేదు. మూడు దశాబ్దాలు చెమటోడ్చిన ఉద్యోగులు, ఇప్పుడు కుటుంబాల ముందు తలదించుకుంటున్నారు. కొంతమంది బకాయిలు రాకుండానే మరణించారు. మరికొందరు బతికే ఉన్నా ఆశలు చనిపోయాయి. "మా చెమటను ఈ ప్రభుత్వం తక్కువగా అంచనా వేసింది. ఒకప్పుడు రాష్ట్రానికి తీపి ఇచ్చాం. ఇప్పుడు చేదు నిర్లక్ష్యం మాత్రమే," అని మాజీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పరిస్థితి కూడా దారుణం. సుగర్ ఫ్యాక్టరీ మూతపడడంతో చక్కెరగడ రైతులు పంటతోనే మునిగిపోతున్నారు. పంటకు మార్కెట్ లేదు, సపోర్ట్ లేదు. ఒకప్పుడు లారీలతో కిటకిటలాడిన రోడ్లు ఇప్పుడు శూన్యంగా మారాయి. రైతుల ఆదాయం లేకుండా గ్రామాలు వెలవెలబోతున్నాయి.

ప్రభుత్వం మౌనం..పాలన వైఫల్యం

వందల కోట్ల రూపాయల ప్రాజెక్టుల కోసం రోజూ ప్రకటనలు ఇచ్చే ప్రభుత్వం, కొద్దీ కోట్లు అవసరమైన ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చిత్తశుద్ధి చూపడం లేదు. ప్రతి ఫైల్లో ఉద్యోగుల హక్కులు ఇరుక్కుపోయాయి. ఇదిపాలనా వైఫల్యం కాదు మానవత్వం పతనం.

మాటలు కాదు, చర్యలు కావాలి

ఉద్యోగులు, కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు ఏకకోణం గా చెబుతున్నారు."బకాయిలు వెంటనే చెల్లించండి. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టండి. లేకపోతే ఇచ్చిన హామీలు చరిత్రలో మోసపూరితంగా మిగిలిపోతాయి."



వైసిపి డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి

వైసిపి డిజిటల్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కావలిలోని వైసిపి కార్యాలయంలో "వైఎస్ఆర్‌సిపి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్"ను కావలి మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. వైసిపి కార్యకర్తలకు ఎటువంటి సమస్య ఉన్నా ఈ బుక్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా పొందు పరచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జంపాని రాఘవులు జెడ్‌పిటిసి, గంధం ప్రసన్నాంజనేయులు, పందిటి కామరాజు దామిశెట్టి సుధీర్ నాయుడు, షేక్.నాయబ్ రసూల్, షాహుల్ హమీద్, నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, కలికి శ్రీనివాసులు రెడ్డి, నంబూరి వెంకటేశ్వర రెడ్డి, మండలి కృష్ణారావు, కుందుర్తి శ్రీనివాసులు, కామయ్య, నాగేశ్వరమ్మ, వెంగళశెట్టి కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒలకు మెమోరాండం అందజేత



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో, ఎంఇఒలకు ఫ్యాప్టో (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) ఆధ్వర్యంలో గురువారం మెమోరాండం సమర్పించారు. అనంతరం వారు పత్రికా విలేకరులతో మాట్లాడుతూ 2025 అక్టోబర్ 07 తేదీ విజయవాడలో ధర్నా చౌక్‌లో జరిగిన పోరుబాట కార్యక్రమంలో బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరించాలని, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపుమేరకు, 2025 అక్టోబర్ 10వ తేదీ నుండి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, మూల్యాంకానికి సంబంధించిన పరీక్షల నిర్వహణ, తదితర పనులు మాత్రమే నిర్వహిస్తామని, ఇకమీదట ఏ ఇతర బోధనేతర పనులను గానీ, గూగుల్ షీట్స్ నింపడం కానీ, విద్యాశక్తి, జిఎస్‌టి 2.0 లాంటి సీజనల్ ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు చేపట్టబోమని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ మెంబర్ యు.మల్లికార్జునరావు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఖాజా రహమతుల్లా, జిల్లా కౌన్సిలర్ జి.సుబ్బయ్య, గౌస్ బాషా, వెంకటరామయ్య, ఫయాజ్ అలీ, హబీబ్ భాషా, జి.రవీంద్ర, వెంకటరాజా, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-జలదంకి : అన్నవరంలో ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందిన పశువుల కాపరి ధనరాశి మాలకొండయ్య కుటుంబ సభ్యులను వైసిపి మాజీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండా రెడ్డి గురువారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. మృతి సంఘటన గురించి మృతుని పెద్ద కుమారుడు మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట అన్నవరం గ్రామపెద్ద గోచిపాతల వెంకటకృష్ణయ్య ఉన్నారు.

నేడు బోధనేతర పనులు బహిష్కరణ

ప్రజాశక్తి-విడవలూరు: ఫ్యాప్టో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అక్టోబర్ 10 వ తేదీ నుండి పాఠశాలలో పిల్లలకు బోధన, మధ్యాహ్న భోజన పథకం అమ లు, పిల్లలు హాజరు ఆన్లైన్, పరీక్షల నిర్వహణ తప్ప మిగతా ఏ బోధనేతర పనులను పాఠశాలలో నిర్వహించబోమని మండల శాఖ వారు ఎంఇఒకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ నాయకులు చెంచు రామయ్య, యుటిఎఫ్ నాయకులు విశ్వనాథ్, మైపాటి శ్రీనివాసులు, బిటిఎ నాయకులు చెంచు కృష్ణయ్య, ఎపిటిఎఫ్నాయకులు సురేంద్ర, ఆనందపాల్, మునీంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్వద్ద ఎంఎల్ఎ, తదితరులు

హెలిప్యాడ్ను పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కోవూరు: వెంకటాచలం మండలం, తాటిపర్తిపాళెం వద్ద విశ్వ సముద్ర బయో ఎనర్జీ ప్రయివేటు లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఈ నెల 10న సిఎం చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్తో కలిసి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు సమీపంలో సుగర్ ఫ్యాక్టరీ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ సందర్శించారు. అధికారులతో కలిసి హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిఎం పర్యటన సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని ఆమె అధికారులకు సూచిం చారు. కార్యక్రమంలో రెవెన్యూ ,పోలీసు అధికారులతో పాటు టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ నాగరాజు, కోవూరు, బుచ్చి టిడిపి అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, బెజవాడ జగదీష్ , టిడిపి నాయకులు మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు: టిబి నివారణ సిబ్బంది ప్రతి ఒక్కరు క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు సమిష్టి కృషి చేయాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ విభాగం అధికారి డాక్టరు ఎస్కె ఖాదరవల్లి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలోని డామిన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్లో టిబి నివారణ సిబ్బందితో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి నివారణ సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని , క్షేత్రస్థాయిలో టీబీ పేషెంట్లకు అందుతున్న సేవల గురించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ గురించి టిబి యూనిట్ వారీగా వివరాలు సేకరించారు. కార్యక్ర మంలో జిల్లాలో ఉన్నటువంటి సూపర్వైజర్లు, ల్యాబ్ సూపర్వైజర్లు, టీబిహెచ్ వీలు, డిస్ట్రిక్ సూపర్వైజర్స్ స్టాఫ్ , భవ్య సిబ్బ ంది, డ్యామేన్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలుగ్రామాలకు చెందిన రైతులు 922బేళ్లను వేలానికి తీసుకురాగా, వాటిలో పలు కంపెనీల వారు 713బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 203 బేళ్లను వివిధ రకాల కారణాలతో తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ ఎస్ 14, ఎన్ బి 151ఆర్ ఆర్ 09సి ఆర్ 29ఉన్నాయని, అధిక బరువు ఉన్న 06బేళ్లను వేలానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.315 కనిష్ఠ ధర రూ.83, సగటు ధర రూ.70 ఈ వేలంలో 11మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

పొగాకు రహిత యువత కోసం ప్రచారం



మాట్లాడుతున్న డిఎంఅండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-నెల్లూరు

అక్టోబరు 9 నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "పొగాకు రహిత యువత కోసం ముమ్మర ప్రచార కార్యక్రమం నిర్వహిసున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి.సుజాత పేర్కొన్నారు. గురువారం నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఛాంబర్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత పొగాకు వాడకాన్ని నిరోధించడానికి లేదా మానేయడానికి ప్రేరేపించే లక్ష్యంతో 60 రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది "యువత, గ్రామీణ వర్గాలలో పొగాకు ప్రమాదాల గురించి ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా పాఠశాలలు కళాశాలలను పొగాకు నుండి విముక్తిగా ఉంచడానికి పొగాకు రహిత విద్యాసంస్థల కోసం సవరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా మెరుగుపరచడం, నియంత్రణ చట్టాల అమలును బలోపేతం చేయడం, ముఖ్య ంగా సిఒటిపిఎ 2003, ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం (సిఈసిఎ) 2019 ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగా పొగాకు రహిత గ్రామాలను ప్రోత్సహించడం, పొగాకు వల్ల కలిగే హాని, యువతకు మానేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి బలమైన సందేశాలను అందించడానికి డిజిటల్ ప్లాట్ఫారమ్లను ఉపయోగించి సోషల్ మీడియాను విస్తరింప చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డెమోకే కనకరత్నం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అధికారులు, సిబ్బంది, ఎన్సిడి సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురాన్ని ప్రత్యేక పంచాయతీగా చేస్తా



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కొడవలూరు

సంక్షేమం అభివద్ధి చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యం అని ఎల్లాయపాలెం పంచాయతీలు కోటి 50 లక్షలు రూపాయలతో అభివద్ధి పనులు చేసినామని రామాపురాన్ని ప్రత్యేక పంచాయతీగా చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెప్పారు. ఆమె గురువారం నాడు కొడవలూరు మండలం ఎల్లాయ పాలెం పంచాయతీ లోని రామాపురం ఎన్టీఆర్ కాలనీ లో పర్యటించారు. 11 లక్షల రూపాయలతో నిర్మించిన సి సి రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో దాదాపు కోటి 50 లక్షలతో ఎల్లాయపాలెం గ్రామంలో రోడ్లు డ్రైన్స్ లాంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎన్టీఆర్ కాలనీలో పిల్లల ప్రాణాలకు ప్రమాదకరంగా ఉన్న గుంతలకు మూడు లక్షల రూపాయలతో కంచె ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభివద్ధి సంక్షేమం సమబాలలో అమలు చేయడం చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. అనంతరం రాజుపాలెం లో నిర్వహించిన జిఎస్టి అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని ప్రజలకు వ్యాపారస్తులకు జీఎస్టీ పై అవగాహన కల్పించారు. రాజుపాలెం లోని ఉన్న దుకాణా లకు ఆమె వెళ్లి అక్కడ యజమానులను ప్రజలను జిఎస్టి తీసివేయడంతో ఎంత ఆదా అవుతుందని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాప వెంకటేశ్వర్లు నాయుడు టిడిపి మాజీ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి సాగునీటి సంఘం అధ్యక్షులు వెంకటరమ ణారెడ్డి సొసైటీ చైర్మన్ ఏ కొల్లు వంశీ రెడ్డి ఎంపీటీసీ గరిగిపాటి రాజేంద్ర డిస్ట్రిబూటర్ కమిటీ ఉపాధ్యక్షుడు జొన్న శివకుమార్ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కరకటి మల్లికార్జున టిడిపి నాయకులు భూలోకం విజయ్ కుమార్ టిడిపి ఎస్సీ సెల్ నాయకులు టీ ప్రవీణ్ కుమార్ ఎంపీడీవో సుబ్బారావు ఎమ్మార్వో స్ఫూర్తి రెడ్డి పంచాయతీరాజ్ డిఇ మోహన్ రావు ఎంఈఓ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్లో స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం



మాట్లాడుతున్న హరికృష్ణ

ప్రజాశక్తి-నెల్లూరు: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో నగరంలోని జిజిహెచ్ ఆవరణలో స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పరిసరాలను శుభ్రం చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ప్రజలకు స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ భారత ప్రభుత్వం క్షేత్ర ప్రచార సహాయకులు పి హరికృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం దేశ పౌరులను పరిశుభ్రతా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించి, "పరిశుభ్రతే సేవ" అనే సందేశాన్ని వ్యాప్తి చేసి ప్రజలలో పరిశుభ్రత పట్ల అవగాహన పెంచి అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యమే మహాభాగ్యం అనే విధంగా జీవించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో మేర యువ భారత్ డివైఒ ఏ మహేంద్ర రెడ్డి, శ్రీకృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల డీన్ సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో బిపిటి విత్తనాలు



ప్రజాశక్తి-విడవలూరు: మండలంలోని మన్మధరావుపేట గ్రామంలో రెండు రోజులపాటు గిరిజన రైతులకు జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేన పథకం కింద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో రైతులకు వరి, వేరుశనగ లో విత్తన శుద్ధి గురించి ఒక్క ఆవశ్యకతను వివరిస్తూ ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం నెల్లూరు ప్రధాన శాస్త్రవేత్త పరమశివా మేడం వారిలో కాండం తొలుచు పురుగు, సుడిదోమ ఆకుముడత లక్షణాలను వివరిస్తూ వాటి నివారణ చర్యలను వివరించారు. అదేవిధంగా సోలార్ ట్రాప్ ప్రాముఖ్యతను రైతులకు తెలియజేసి రైతులందరూ కూడా వాడుకోవాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం నెల్లూరులో బిపిటి 5204 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్ర మంలో సిహెచ్ఎస్ లక్ష్మీ, విఎఎ విష్ణు ప్రియ, సుభాషిణి, సాయి లక్ష్మి, పాల్గొన్నారు.



దెబ్బతిన్న తారు రోడ్డు..
-ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నుంచి వెంకటాద్రి పాలెం వరకు కొద్ది నెలల కిందట నిర్మించిన తారు రోడ్డు నెర్రెలిచ్చింది. నిర్మాణంలోని డొల్లతనం బయట పడింది. రోడ్డులోని 100 మీటర్లు పొడవునా బద్ధలుగా పగిలిపోయి కనిపిస్తోంది. అవినీతి ఏ స్థాయిలో జరిగింది. అనేందుకు వెంకటాద్రిపాలెం రోడ్డు అద్దం పడుతుంది. నిర్మాణ నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక ట్రక్కు మట్టి తోల కుండారోడ్డు ప్రక్కన గుంటలు తీసి ఆ మట్టిని మాత్రమే వేసి నిర్మించారు. కాంట్రాక్టర్ తీసిన గుంటల వల్ల రైతులు తమ పొలాలలోకి వెళ్ళడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని చెపుతున్నారు. ఇంజనీరింగ్ అధికారుల అవినీతి కారణంగానే కోట్ల రూపాయల నిధులు వృథా అవుతున్నాయని చెబుతున్నారు. వర్షం పడినప్పుడు బరమ్మట్టి మొత్తం జారి పోతుంది. ప్రమాదాలకు రోడ్డు కేంద్ర బిందువుగా మారుతోంది. అభివృద్ధి మాటున జరిగిన ఈ అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలి.

ఎంఎల్ఎను కలిసిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కొడవలూరు :కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ని గురువారం సిపిఎం నాయకులు కలిసి సమస్యలను పరిష్కరించాలని ఆమెకు వినతిపత్రం అంద జేశారు. ఎల్లాయపాలెం పంచాయతీ రామాపురం ఎన్టీఆర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా సిపిఎం నాయకులు ఆమెను ప్రత్యేకంగా కలిసి రామాపుర ంలోని బస్సు షెల్టర్ కూలిపోయిందని గ్రామంలో డ్రైనేజీ లేక మురికి నీరు కాలనీలోకి ప్రవహిస్తుందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె దష్టికి తీసుకెళ్లారు. వాటి కి నిధులు కేటాయించి బస్ షెల్టర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా డోలా రామచంద్రయ్య సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ విభజనకు అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-కొండాపురం: మండలంలో మేజర్ పంచాయతీ సాయిపేటను రెండు పంచాయతీలుగా విభజించేందుకు గురువారం సచివాలయం వద్ద డిప్యూటీ ఎంపిడిఒ ఆధ్వర్యంలో అభిప్రాయ స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి కోటేశ్వరమ్మ మాత్రమే పాల్గొన్నారు. జెడ్పిటిసి ఎల్ల వెంకట్రావు, ఎంపిటిసిలు పొన్నం గోవిందమ్మ, కోనేటి రమాదేవి ధైర్వాజరవ్వటం కొందరు వార్డు మెంబర్లు కూడా గైర్హాజరయ్యారంటే పంచాయతీ విడదీయడం వీరికి ఇష్టం లేక హాజరు కాలేదా అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో గొడవలూర సొసైటీ అధ్యక్షుడు కుంకు మోహన్రావు, తానికొండ అనూష, టిడిపి సీనియర్ నాయకుడు గంట లక్ష్మీనరసింహులు, మాజీ జెడ్పిటిసి మహేశ్వరరావు, దామ శివబాబు, వల్లూరు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-వింజమూరు :మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలను గురువారం మండల విద్యాశాఖ అధికారులు పోలుబోయిన రమేష్, మధుసూదన్ రెడ్డి లాంఛనంగా వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడలను ప్రారంభిం చారు. ఈ క్రీడా ఎంపికలు గురు, శుక్రవారాల్లో బాల బాలికలకు అండర్-14, -17 వాలీబాల్, కబడ్డీ కోకో, చెస్ యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్ పోటీలు జరుగునని తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు కావలి డివిజన్ స్థాయిలో ఎంపికలలో పాల్గొంటారు. ఈ క్రీడా ఎంపికలలో మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లలో విద్యార్థినీ విద్యార్థులు 250 మంది పాల్గొన్నారు. పై కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.ప్రభాకర్ రెడ్డి, వెలుగోటి కృష్ణ, ఎం.తిరుపాల్రెడ్డి, ఆర్.అంజయ్య, ఆర్.రజనీ విలాసిని, సుమలత, సిద్ధిక్, శ్రీనివాసులు వ్యవహరించారు.